క్లుప్తంగా

పుట్లగట్లగూడెంలో పలు సేవా కార్యక్రమాలు


పుట్లగట్లగూడెంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని పుట్లగట్లగూడెం మాజీ సర్పంచ్ స్వర్గీయ వామిశెట్టి దుర్గమ్మ రెండవ వర్ధంతి సందర్భంగా గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. 400 మంది ఉపాధి కార్మికులకు అల్పాహారం, శీతల పానీయాలను అందించారు. అలాగే 14 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గమ్మ కుమారులు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, వామిశెట్టి నాగేంద్ర కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణా తరగతులు


గ్రంథాలయంలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

లింగపాలెం : వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం ధర్మాజీగూడెం శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం నీతి పద్యాలు, జనరల్ నాలెడ్జ్, తెలుగు హ్యాండ్ రైటింగ్, డ్రాయింగ్, చదరంగం క్రీడపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులచే మైండ్ మెమరీ గేమ్స్ చేయించినట్లు ధర్మాజీగూడెం శాఖ గ్రంథాలయాధికారిణి సీహెచ్‌వీ రమణ తెలిపారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం


శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాత గిరిలో జ్యేష్ఠమాసం శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి కల్యాణాన్ని జరిపించారు. ఉభయదారులుగా ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ ఉప్పల గంగాధరం దంపతులు వ్యవహరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించి తరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు.

సీతారామనగరంలో డ్వామా పీడీ విచారణ

కుక్కునూరు : సీతారామనగరం పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పనులపై గురువారం డ్వామా పీడీ రాము విచారణ జరిపారు. అనంతరం కుక్కునూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులను పారదర్శకంగా ముందుకు తీసుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. మస్టర్ల విషయంలో అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవకతవకలకు పాల్పడినట్టు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జంగారెడ్డిగూడెం క్లస్టర్ ఏపీడీ ప్రఫుల్, ఏపీఓ స్వర్ణకుమారి, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో...


ఐఏఎస్ అధికారి సింహాచలంకు శ్రీవారి మెమొంటో అందజేత

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రాన్ని ఐఏఎస్ అధికారి సింహాచలం (అమరావతి) గురువారం రాత్రి సందర్శించారు. ముందుగా ఆయన కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందగా, ఆలయ ఏఈఓ పి.నటరాజారావు ఆయనకు స్వామివారి మెమొంటోను అందించారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ఏలూరు (టూటౌన్): ఏలూరు జూట్ మిల్లు యాజమాన్యం మొండి వైఖరిని వ్యతిరేకిస్తూ.. కార్మికులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు ఐఎఫ్‌టీయూ అనుబంధ జూట్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 6న జేసీఎల్ ఆఫీసులో ఏలూరు జూట్ మిల్లు విషయమై జరిగిన చర్చలలో యాజమాన్యం మొండిగా వ్యవహరించిందన్నారు. ధర్నాలో కార్మికులంతా పాల్గొనాలని వెంకట్రావు విజ్ఞప్తి చేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- తిమ్మాపురంలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన
- లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ


మహిళకు ఇళ్ల పట్టాను అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని తిమ్మాపురం ఎస్సీ కాలనీలో జలజీవన్ మిషన్ నిధులు రూ.44.37 లక్షలతో 60 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గానికి జలజీవన్ మిషన్ నిధులు రూ.39 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. అందులో ద్వారకాతిరుమల మండలానికి రూ.10.60 కోట్లు వెచ్చించామని, త్వరలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. ఇప్పటికే నల్లజర్ల మండలంలో రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఇస్తామన్నారు. వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన ప్రతి చోట మంచినీటి బోర్లను నిర్మించామన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలను పంపిణీ చేశామని, సెకండ్ ఫేజ్‌లో ఇళ్లను నిర్మిస్తున్నట్టు తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మహిళల సంక్షేమానికి, వారి అభ్యున్నతికి జగన్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా ఇప్పటివరకు నియోజకవర్గంలో రూ. 2 వేల కోట్ల సంక్షేమ ఫలాలను మహిళలకు అందించామన్నారు. అదేవిధంగా రూ. 5 వందల కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్టు చెప్పడానికి గర్విస్తున్నామన్నారు. జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని హామీలను నెరవేరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, నల్లజర్ల మండల పార్టీ కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ యర్రగొల్ల రజని, ఆచంట రాకేష్ (బన్ను), బోళ్ల శ్రీనివాసరావు, పోలిన నారాయణరావు, నల్లంటి రామారావు, ఆకుర్తి శ్రీను, అప్పసాని ధర్మారావు, చవల రాంబాబు, ఘంటా శేఖర్, పిట్టా వెంకటేశ్వరరావు, కొనకళ్ల వెంకట సతీష్, కొత్తపల్లి కుమారి వెంకన్న, ముళ్లపూడి రాంబాబు, జాలాది పెద్దిరాజు, మురుగుల దుర్గయ్య, బొండాడ వెంకన్నబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, రుద్ర శివాజీ, ద్వారకాతిరుమల సర్పంచ్ కుంటం స్వర్ణలత, గోపా నాగేశ్వరరావు, గుర్రాల లక్ష్మణ్, షేక్ భాషా, భోగరాజు చిన్నచిన్ని తదితరులున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తా


కృపామణి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

కొయ్యలగూడెం : మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానని మహిళా సమాఖ్య మండల నూతన అధ్యక్షురాలు తోట కృపామణి గురువారం పేర్కొన్నారు. మహిళా సమైక్య కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపర్చుతున్న విధానాలు, పథకాలు మహిళలందరికి తెలియపర్చుతామన్నారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పథకం ద్వారా మహిళల ఆర్థిక పరిపుష్టికి అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. నాబార్డు ద్వారా మహిళలకు సాంకేతిక శిక్షణ ఇప్పించటానికి ప్రయత్నం చేస్తానని జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు అందిపుచ్చుకోవాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, డీఆర్‌డీఏ పీడీ విజయ రాజు, ఇతర నాయకులు, అధికారుల సహకారంతో మండలంలో ఉన్న మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

పోలవరం ఎంపీడీవోగా శ్రీను బాధ్యతల స్వీకరణ

పోలవరం రూరల్ : పోలవరం ఎంపీడీవోగా జి.శ్రీను గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కృష్ణాజిల్లా జి.గొండూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్‌డీగా పనిచేస్తూ పదోన్నతిపై బదిలీ అయ్యి పోలవరం ఎంపీడీవోగా వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసబాబు ఎఫ్ఏసీ ఎంపీడీవోగా వ్యవహరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జగనన్న విద్యాకిట్ల తనిఖీ


శింగగూడెం జేవీకే స్టాల్ పాయింట్‌ను పరిశీలించి టీం సభ్యులకు సూచనలు చేస్తున్న సీఎంవో

లింగపాలెం : పాఠశాలలు పునః ప్రారంభం నాటికి ప్రతి ఒక్క పాఠశాలలో జగనన్న విద్యాకిట్లను సిద్ధంగా ఉంచాలని జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంఓ) రవీంద్ర అన్నారు. గురువారం లింగపాలెం మండలం శింగగూడెం హైస్కూల్ స్టాక్ పాయింట్లో ఉన్న జగనన్న విద్యాకానుక కిట్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పాయింట్ నుంచి స్కూల్ పాయింట్‌కి ఎంఈవోలు స్టాక్ పంపుతున్నారా లేదా అని ఆయన పరిశీలించారు. జగనన్న విద్యా కానుకలు ఉన్న ప్రతి రూమ్‌కు వెళ్లి వస్తువుల నాణ్యతను పరిశీలించారు. ట్రాన్స్‌పోర్టుకి సంబంధించి రూట్ మేప్ పరిశీలించి కొన్ని సూచనలు, సలహాలు అందజేశారు. యూనిఫాం నాణ్యతను పరిశీలించారు.

జగన్ పాలనలో గడపగడపకు సంక్షేమం

- చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- కొండగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం


కొండగూడెంలో సంక్షేమ పథకాలు వివరిస్తూ బ్రోచర్లు అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

కామవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలో గురువారం కొండగూడెం గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ఇంకా అర్హులైన వారు ఎవరైనా ఉంటే వెంటనే అధికారులు దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామంలో నాటు సారా తయారీతో పాటు, అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని, అధికారులు మామూళ్లు ముసుగులో చూసి చూడనట్టు వదిలేస్తున్నారని కొందరు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ నాటు సారా విక్రయాలు అరికట్టేందుకు చర్య తీసుకుంటానని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ముఖ్యమంత్రిగా పరిపాలన చేపట్టిన అనతి కాలంలోనే నవరత్నాల పథకాలను అమలుపరిచి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించారన్నారు. దీంతో దేశంలోని ఇతర రాష్ట్రాలు సీఎం జగన్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయా రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలు అమలుపరిచే దిశగా చూస్తున్నాయన్నారు. వైఎస్సార్ సీపీకి రాష్ట్ర ప్రజలు అండగా నిలుస్తున్నారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 175 సీట్లు గెలుపొందడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, కామవరపుకోట సర్పంచ్ కరిపోతు అనూష, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, కోటగిరి కిషోర్ బాబు, నల్లూరి ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినికి గాయాలు

జంగారెడ్డిగూడెం : రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలైనట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం బుట్టాయగూడెం మండలం పైదావారిగూడెంకు చెందిన పైడా దీపిక 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు జంగారెడ్డిగూడెం వచ్చింది. పరీక్షలు రాసిన అనంతరం తండ్రి మోటార్‌సైకిల్‌పై ఇంటికి వెళుతున్న సమయంలో స్థానిక మార్కండేయపురం సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న కారు వీరి మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. దీంతో విద్యార్థినికి గాయాలయ్యాయి. వెంటనే తండ్రి వెంకటేశ్వరరావు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు తండ్రి పైడా వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలిపిన నేతలు


ఏలూరులో జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్‌ను అభినందిస్తున్న దాసరి దంపతులు


గంటా పద్మశ్రీ ప్రసాద్‌ను అభినందిస్తున్న గంజి మాల దంపతులు

కొయ్యలగూడెం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్‌ను కొయ్యలగూడెం మండల ప్రజాప్రతినిధులు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. ఏలూరు జెడ్పీ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా విద్యా, వైద్య స్టాండింగ్ కమిటీ సభ్యురాలు జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, విష్ణుమూర్తి దంపతులు, అదేవిధంగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి, ఎంపీపీ గంజిమాల రామారావు కలిసి అభినందించారు.

సచివాలయానికి అదనంగా రూ. 20 లక్షల కేటాయింపు

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బాలరాజు


సీఎంకు సమస్యలను వివరిస్తున్న బాలరాజు (ఫైల్)

బుట్టాయగూడెం : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అత్యంత ప్రాధాన్యత పనుల కోసం ప్రభుత్వం కేటాయించిన రూ.20 లక్షలతో పాటు మరొక రూ.20 లక్షలు గిరిజన ప్రాంతంలోని సచివాలయానికి అదనంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల పోలవరం ప్రాజెక్టు పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో అదనపు నిధుల కేటాయింపుపై చర్చించినట్లు తెలిపారు. సచివాలయ పరిధిలో నిధులు సరిపోవడంలేదని అదనంగా నిధులు కేటాయిస్తే పనులు చేపట్టేందుకు వీలుంటుందని సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. దీనితో సానుకూలంగా స్పందించిన సీఎం వైఎస్ జగన్ గిరిజన ప్రాంతంలోని సచివాలయాల పరిధిలో రూ.20 లక్షలు పెంచినట్లు తెలిపారని అన్నారు. గిరిజన ప్రాంతంలోని సచివాలయానికి రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. అదనంగా నిధులు కేటాయించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన సీఆర్‌టీలు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ 2014 జూన్ 2 నాటికి ఐదేళ్లు పూర్తయిన సందర్భంలో ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేస్తామని ప్రకటించడంపై సీఆర్‌టీలు హర్షం వ్యక్తం చేశారు. అయితే సీఆర్‌టీలోనే అనేక మంది మిగిలిపోతున్నారని వారిని కూడా ప్రభుత్వం క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు గురువారం సాయంత్రం ఆ సంఘ నాయకులు ఒక వినతిపత్రాన్ని అందజేశారు.

భానుడి భగభగలు


నిర్మానుష్యంగా కొయ్యలగూడెంలో నేషనల్ హైవే

కొయ్యలగూడెం : ప్రచండ భానుడి ఉగ్రరూపానికి ప్రజలు అల్లాడుతున్నారు. రోహిణి కార్తె ముగిసినా ఎండలు చల్లబడకపోవడంతో ఇళ్లను వదిలిరాలేని పరిస్థితి. ఎండల ధాటికి జన సంచారం లేక కొయ్యలగూడెంలో జాతీయ రహదారి సైతం నిర్మానుష్యంగా మారింది. నైరుతి రుతుపవనాలు ఎప్పుడెప్పుడా అని ప్రజలు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం


విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్ : మాతన్నగూడెంలో శ్రీముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా తూర్పు పేటలోని రామాలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. కలశ స్థాపనతో ప్రతిష్ఠా మహోత్సవ పూజలు, అమ్మవారి విగ్రహానికి, యంత్రాలకు, శిఖరాలకు జలాధివాస కార్యక్రమం నిర్వహించారు. వేద మంత్రాలతో చండీహోమం జరిపారు. బ్రహ్మశ్రీ గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈనెల 10న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని, భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాలని కమిటీ సభ్యులు తెలిపారు.

క్షతగాత్రుడికి అత్యవసర సేవలు అందజేత


రోడ్డు ప్రమాదానికి గురైన యువకుడికి అత్యవసర సేవలు అందిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడికి సర్పంచ్ దంపతులు అత్యవసర సేవలు అందించి ఆస్పత్రికి తరలించిన ఘటన మండలంలోని దుద్దుకూరు సమీపంలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గొల్లగూడెంకు చెందిన బి.మనోహర్ అనే యువకుడు స్కూటీపై దొరమామిడి నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో దుద్దుకూరు సమీపంలో మలుపు తిప్పే క్రమంలో లోయలో పడ్డాడు. ఈ ఘటనలో మనోహర్ ఛాతిపై గట్టి దెబ్బ తగిలింది. దీనితో అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాడు. ఆ సమయంలో సీతప్పగూడెం సర్పంచ్ సరియం లక్ష్మి, ఉపసర్పంచ్ సరియం చల్లయ్య, ఆర్‌టీసీ కండక్టర్, దొరమామిడి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఓ సుబ్రహ్మణ్యం ఆ యువకుడి గుండెపై గట్టిగా రుద్ది ఆ యువకుడు కోలుకునే విధంగా కృషి చేశారు. అలాగే 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. అయితే అప్పటికే పరిస్థితి తీవ్రంగా ఉండడంతో గ్రామస్తులు దొరమామిడి ప్రభుత్వాస్పత్రికి ద్విచక్రవాహనం తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. సకాలంలో యువకుడికి వైద్యసేవలు అందించే విధంగా కృషి చేసిన సర్పంచ్ దంపతులతో పాటు కండెక్టర్, ఎంపీహెచ్‌ఓలను పలువురు అభినందించారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు చిన్న వయసులో కేవలం చదువుపైనే దృష్టి పెట్టాలని, సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని బాల వికాసం ట్రైనర్ రామడుగు విజయకుమార్ సూచించారు. ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా 32వ రోజు గురువారం కార్యక్రమంలో విజయకుమార్ మాట్లాడారు. విద్యార్థులకు మెమరీ పవర్ గేమ్స్ గురించి, సెల్ ఫోన్లు వల్ల జరిగే లాభాలు, నష్టాలను వివరించారు. గంటల తరబడి ఫోన్ వాడితే నేత్రాలు దెబ్బతింటాయని, కళ్ల జోళ్లు వేసుకొనే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. విద్యార్థులకు పుస్తక విభాగంలో వీటీ సందీప్ కుమార్ నీతి కథలపై పోటీలు నిర్వహించారు. డి.శ్రీవల్లీ విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్స్‌లో రోలింగ్ పేపర్ డిజైన్, యోగాసానాలలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతులను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు పర్యవేక్షించగా డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం


వైష్ణవ సేవా సంఘ భవనం శంకుస్థాపనకు హాజరైన ఎంపీ శ్రీధర్

ఎంపీ కోటగిరి శ్రీధర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమాజ శాంతికి పాటుపడే బ్రాహ్మణులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. గురువారం నగరంలోని మాదేపల్లి ఫేజ్–2 ఇందిరమ్మ కాలనీలో ది హేలాపురి వైష్ణవ సేవా సంఘ భవన నిర్మాణానికి నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బ్రాహ్మణ సామాజికవర్గం అంటే ప్రత్యేక అభిమానం ఉందని చెప్పారు. బ్రాహ్మణుల్లోని పేదలకు కూడా వర్తించేలా సంక్షేమ పథకాలను అమలు చేయడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఏలూరు నియోజకవర్గ పరిధిలో బ్రాహ్మణులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. తొలుత ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని వైష్ణవ సేవా సంఘ భవనం నిర్మాణానికి కేటాయించిన 200 గజాల స్థలంలో భవన నిర్మాణానికి సంఘ ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏలూరు నగర బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షుడు టీఆర్ శర్మ, అఖిల భారత బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు ఎంబీఎస్ శర్మ, ఆర్ష సేవా సమితి అధ్యక్షుడు బీవీ సుబ్రహ్మణ్యం, ఆర్‌ఆర్‌పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, వేదపాఠశాల ఉపాధ్యక్షుడు సీతంరాజు చక్రధర్, ఎంవీఆర్ఎస్ శర్మ, వైష్ణవ సేవా సంఘం అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో కూడిన విద్యను అందించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించాలని ఏలూరు జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి ఏవీఎస్ఎన్ భాస్కర్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లాలోని దూబచర్ల ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పునాది దశలోనే విద్యార్థులకు భాషా నైపుణ్యం, సంఖ్యా శాస్త్ర నైపుణ్యాలను బోధించాలన్నారు. నూతన విద్యా విధానాన్ని అవగాహన చేసుకుని, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దాలని కోరారు. ఉపాధ్యాయుల చేత నిపుణ్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు.

లిడ్‌క్యాప్ ఎండీని సస్పెండ్ చేయాలి

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (లిడ్ క్యాప్)ని పరిరక్షించాలని, సంస్థలో అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడుతోన్న ఎండీ డోలా శంకర్‌ను సస్పెండ్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత సమగ్ర విచారణ చేయించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జగ్జీవన్‌రామ్ చర్మకారుల కారిక సంక్షేమ సంఘం కోరింది. స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ మాట్లాడుతూ లిడ్ క్యాప్‌ను పరిరక్షించాలన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎండీని సస్పెండ్ చేసి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జగ్జీవన్ రామ్ చర్మకారుల సంక్షేమ సంఘం ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్ల మూడి వెంకట్రావు, లక్కపాము చంటి, పింగుల ఇధియా తదితరులు పాల్గొన్నారు.